ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024



- ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీరు..
- ఎన్నికల సమయంలో టీడీపీ ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు
- వట్టిగెడ్డ, బాసంగి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పట్టించుకోలేదని వ్యాఖ్యలు
- అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించిన వైనం
- నిధులు మంజూరైనా.. పూర్తికాని ఆధునికీకరణ పనులు
- వైసీపీ ప్రభుత్వం తీరుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి

వట్టిగెడ్డ రిజర్వాయర్



ఒట్టి మాటలు.. ఉత్తి చేతలు

మోసం గురూ!



(జియ్యమ్మవలస)

ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ అప్పటి టీడీపీ ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు గుప్పించారు. జిల్లాలోని సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ ఈ ఐదేళ్లలో వాటి ఊసే ఎత్తలేదు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు. వ్యవసాయాధారిత జిల్లాలో రైతులకు మేలు చేసే ఒక్క పనినీ చేయలేకపోయారు. దీంతో జిల్లావాసులు మండిపడుతున్నారు. విమర్శలు.. ఊకదంపుడు మాటలు! ఉత్తుత్తి చేతలేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. హామీలిచ్చి గద్దెనెక్కిన సీఎం జగన్.. వాటిని నెరవేర్చకపోవడం ఎంతవరకు సమంజసమని విమర్శిస్తున్నారు. 'మాట తప్పను.. మడమ తిప్పను.. అధికారంలోకి వస్తే.. అన్ని సమస్యలు పరిష్కరిస్తాం' అని వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి ప్రకటనలకే పరిమితవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా గతంలో కురుపాం నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన జగన్.. ఇక్కడి సమస్యలెన్నో ప్రస్తావించారు. ప్రధానంగా తోటపల్లి రిజర్వాయర్ పరిధిలో ఎడమ కాలువ ఆధునికీకరణ, బాసంగి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్, వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులు తదితర అంశాలపై మాట్లాడారు. వాటిని టీడీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అయితే పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత సీఎం జగన్ వాటిని పూర్తిగా మరిచారు. కనీసస్థాయిలో వాటికి నిధులు కేటాయించలేదు. బాసంగి నిర్వాసిత సమస్యలను పూర్తిగా విస్మరించారు. వారికి ఇళ్లను కూడా మంజూరు చేయలేదు.



ఆధునికీకరణ లేక వట్టిగెడ్డ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ ఇలా..

- జియ్యమ్మవలస మండలం వట్టిగెడ్డ రిజర్వాయర్ విషయానికొస్తే.. ఆధునికీకరణ పనులకు వైసీపీ ప్రభుత్వ పాలనలోనే జైకా నిధులు మంజూరయ్యాయి. 2019 ఫిబ్రవరి 8లో పరిపాలనా ఆమోదంతో రూ. 44.85 కోట్లు కేటాయించారు. 2020, ఆగస్టు 19న సాంకేతిక అనుమతి లభించింది. ఈ ఆధునికీకరణ పనులకు ఉప ముఖ్యమంత్రి హోదాలో 2020, డిసెంబరు 27లో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. అయితే 24 నెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. నాలుగేళ్లలో కేవలం 15 శాతం పనులే జరిగాయి. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఈ రిజర్వాయర్ ద్వారా 17 వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉందని గత ఎన్నికల సమయంలో జగన్ చెప్పినా.. ఆ మేరకు పనులు చేపట్టకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. రైతు ప్రభుత్వం అంటే ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. నిధులు మంజూరైనా వట్టిగెడ్డ ఆధునికీకరణ పనులు సకాలంలో పూర్తిచేయ లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

గుమ్మిడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం ఇదే..



- జంఝావతి ప్రాజెక్టుపై ఒడిశాతో మాట్లాడి గేట్లు ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చినా.. ఐదేళ్లలో ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. కనీసం ఒడిశాతో ఉన్న వివాదాలను సైతం పరిష్కరించలేకపోయారు. దీంతో జంఝావతి పరిధిలో ఏడు వేల ఎకరాలకే సాగునీరు అందుతోంది. వాస్తవంగా గరుగుబిల్లి, కొమరాడ, పార్వతీపురం మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ ఐదేళ్ల కాలంలో వైసీపీ వాటిపై దృష్టిసారించకపోవడంతో మూడు మండలాల రైతులు సాగునీటి కోసం ఏటా కటకటలాడాల్సి వస్తోంది.
- కురుపాం మండలంలో గుమ్మిడి గెడ్డపై వంతెన నిర్మాణం, మినీ రిజర్వాయర్ ఏర్పాటు హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి.
- కొమరాడ మండలం నాగావళి నదిపై పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణంపై కూడా జగన్ విమర్శించారు. అయితే అధికారంలోకి వచ్చాక.. మిగిలిన 20 శాతం పనులకు కూడా పూర్తిచేయలేకపోయారు.

సర్కారు నిర్లక్ష్యం వల్లే..

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వట్టిగెడ్డ రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీనివల్ల రైతులు ఏటా సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. కనీస చర్యలు చేపట్టలేదు.

-అప్పలనాయుడు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, వీరఘట్టం

పనులు పూర్తిచేస్తాం

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపడతాం.

- నీటిపారుదల శాఖ అధికారి



భవన నిర్మాణాలకు నోచుకోని గిరిజన విశ్వ విద్యాలయ స్థలం

గిరిజన విశ్వవిద్యాలయ భవనాలేవీ?

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి పూర్తిగా పట్టాలు తప్పింది. నిరుద్యోగులకు ఉపాధి లేదు.. ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. పరిశ్రమలు రాలేదు.. పర్యాటకం కళ తప్పింది.. కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వలేదు. వృత్తిదారులకు రుణాలు దక్కలేదు. ధరల మంటలు మాత్రం నింగికెగిశాయి. వెరసి అన్ని వర్గాలూ తీవ్రంగా నష్టపోయాయి. ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసిన గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడుందో నేటికీ చెప్పలేని దుస్థితి. ఈ వర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేసినట్టు పరిపాలనా పరమైన ఆమోదం తెలిపింది. అయినా భవన నిర్మాణం ప్రారంభించలేదు. టీడీపీ హయాంలో కొత్తవలస మండలం రెల్ల గ్రామం వద్ద వర్సిటీ కోసం 500 ఎక రాలు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థలాన్ని మార్చేసి గజపతి నగరం, సాలూరు, దత్తిరాజేరు, మెంటాడ మండలాల సరిహద్దుకు తరలిం చారు. నేటికీ తరగతులు విజయనగరంలోని ఏయూ పీజీ సెంటర్‌లో ఓ భవ నంలోనే కొనసాగుతున్నాయి. బోధనా సిబ్బంది 91 మంది అవసరం కాగా 18 మంది మాత్రమే ఉన్నారు. 13 విభాగాలకు బోధనా సిబ్బంది లేక విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉంటున్నాయి. ల్యాబ్‌లు, లైబ్రరీ లేదు. వసతి కూడా సరిగా లేదు. రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల కేంద్ర వర్సిటీ దుస్థితి ఇలా తయారైంది.

నేడు విజయనగరం జిల్లాలో సీఎం జగన్ పర్యటన

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 22: విజయనగరం మండలం చెల్లూరులో మంగళవారం జరిగే సిద్ధం సభలో సీఎం జగన్ పాల్గొనున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం నుంచి రోడ్డు మార్గాన రాజాపులోవ మీదుగా చెల్లూరు చేరుకోనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సిద్ధం సభలో పాల్గొంటారు. అనంతరం తిరిగి రాజాపులోవ వచ్చి భోగాపురం, పైడిభీమవరం మీదుగా శ్రీకాకుళం జిల్లా రణస్థలం రోడ్డుషోలో పాల్గొంటారు.

అభివృద్ధికి పూచీ నాది

- ఎస్.కోట ప్రజాగళం సభలో చంద్రబాబు

శృంగవరపుకోట, ఏప్రిల్ 22: విశాఖ నగరాన్ని తలదన్నేలా శృంగవరపుకోటను అభివృద్ధి చేసే పూచీ తనదని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. పార్టీ అధికారంలోకి రాగానే ఎస్.కోటను విశాఖ జిల్లాలో కలిపేస్తానని హామీ ఇచ్చారు. సోమవారం శృంగవరపుకోట ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. 'విశాఖ-అరకు రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు ఇరువైపులా పరిశ్రమలు స్థాపించే చర్యలు తీసుకుంటాం. అరకు పర్యాటక ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం. జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తాం. పుణ్యగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం. భీమసింగి చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తాం' అని హామీ ఇచ్చారు. వైసీపీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయని ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

నేడు పర్యటన ఇలా..

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మంగళవారం గజపతినగరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమవారం రాత్రి ఎస్.కోటలోని సిరికి రిసార్ట్స్‌లో బసచేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో బొండపల్లిలో ఏర్పాటుచేసిన మహిళా గళం కార్యక్రమానికి వెళ్తారు. ఆ తరువాత శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరతారు.



ఎస్.కోట ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

నామినేషన్ల జోరు

- పార్లమెంట్‌కు ఐదు..
- శాసనసభకు నాలుగు ..



ఆర్వోకు నామినేషన్ పత్రం అందిస్తున్న టీడీపీ కురుపాం అభ్యర్థి జగదీశ్వరి

పార్వతీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జోరుగా నామినేషన్లు దాఖలయ్యాయి. పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఐదు, శాసనసభ నియోజకవర్గాలకు గాను నాలుగు నామినేషన్లను అధికారులు స్వీకరించారు. అరకు పార్లమెంట్ ఎన్డీఏ అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత సోమవారం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు తన నామినేషన్ పత్రాలను అందించారు. తొలుత పార్వతీపురం పాతబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మంది టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే పాల్గొన్నారు. ఇక ఎంపీ స్థానానికి గాను స్వతంత్ర అభ్యర్థులుగా సమర్థి భవాని , కంగల బాలుదొర, బీఎస్పీ అభ్యర్థిగా వరం ఆవశ్య లహరి, జీడీపీ పార్టీ అభ్యర్థిగా బిడ్డి రామారావు నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను కలెక్టర్‌కు అందించారు. పార్వతీపురం శాసనసభ నియోజకవర్గానికి గాను బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా కుప్పిలి వెంకటరమణ ఆర్వో కె.హేమలతకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. కురుపాం శాసనసభ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వీవీ రమణకు అందించారు. స్వతంత్ర అభ్యర్థిగా ట్రాన్స్ జెండర్ ఎ.గీతారాణి మూడుసెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. పాలకొండ శాసనసభ నియోజకవర్గం నుంచి గొడ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థిగా బిడ్డిక ఉమామహేశ్వరరావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారికి సమర్పించారు. సాలూరు నియోజకవర్గంలో ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు.



కలెక్టర్‌కు నామినేషన్ ప త్రాలు అందిస్తున్న అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత



వన్నాం సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వన్నాంలో ఏనుగులు

- భయాందోళనలో గ్రామస్థులు

కొమరాడ, ఏప్రిల్ 22 : గత కొద్ది రోజులుగా కురుపాం మండలంలో సంచరించిన ఏడు ఏనుగుల గుంపు సోమవారం కొమరాడ మండలం వన్నాం గ్రామ సమీపంలోకి చేరుకున్నాయి. దీంతో ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. మరికొంతమంది ఇళ్లకే పరిమితమయ్యారు. బయటకు రావడానికి సాహసించలేదు. ఏనుగుల గుంపు పొలాల్లోనే సంచరించడంతో పంటలు నాశనం అయిపోయే అవకాశం ఉందని మరోవైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం గ్రామ శివారుల్లో, రహదారులపై ఏనుగులు సంచరిస్తున్నా.. అటవీశాఖాధికారులు స్పందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు, ఇళ్లను గజరాజులు ధ్వంసం చేస్తున్నా.. పూర్తిస్థాయిలో పరిహారం అందించకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇంకెన్నాళ్లు ఇలా బాధలు పడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల కారణంగా ఒంటరిగా పొలాల్లోకి కూడా వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పదిలో 96.37 శాతం ఉత్తీర్ణత

- గతేడాదిలానే జిల్లాకు రాష్ట్రంలో ప్రథమ స్థానం

పార్వతీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా రెండోసారి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. గతేడాది టెన్త్ ఉత్తీర్ణత 87.47 శాతం ఉండగా.. ఈ సారి జిల్లా 96.37 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ ఏడాది మొత్తంగా 10,064 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 4,861 మంది బాలురు, 5203 మంది బాలికలు ఉన్నారు. 8,955 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో, 854 మంది ద్వితీయ స్థానంలో, 255 మంది తృతీయ స్థానంలో పాసయ్యారు. ఇందులో బాలికల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉంది. పార్వతీపురం పట్టణం టీఆర్ఎం ప్రభుత్వ పాఠశాలకు చెందిన కేవీ గౌతమి 591 మార్కులు, పాలకొండ మండలం ఎం.సింగుపురం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.మనోజ్‌కుమార్ 588 మార్కులు , వీరఘట్టం మండలం నీలానగరం జడ్పీ పాఠశాలకు చెందిన డి.సంజన 587 మార్కులు సాధించారు. వారిని కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో పాటు డీఈవో పగడాలమ్మ అభినందించారు. విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వారికి అందించారు. టెన్త్ ఫలితాల్లో జిల్లా వరుసగా రాష్ట్రంలో రెండోసారి ప్రథమస్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ తెలిపారు. అనంతరం డీఈవో, జిల్లా విద్యాశాఖాధికారులు సత్కరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పక్కా ప్రణాళికలతో ఉత్తమ ఫలితాలు సాధించామని డీఈవో పగడాలమ్మ చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి కరుణ, జేసీ శోభిక, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులాల్లో ...

సాలూరు రూరల్, ఏప్రిల్ 22: ఉమ్మడి జిల్లాలో బీఆర్ అంబేద్కర్ గురుకులాలు 96.41 శాతం ఫలితాలు సాధించాయి. ఆయా గురుకులాల నుంచి 976 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 941 మంది ఉత్తీర్ణత (96.41 శాతం) సాధించారు. 35 మంది ఫెయిలయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లాలో బొడ్డవలస గురుకులం నుంచి 72 మందికి గాను 71 మంది, భామినిలో 79 మందికి 78 మంది ఉత్తీర్ణత సాధించారు. పాలకొండలో 76 , కొమరాడలో 75, గరుగుబిల్లిలో 79, పార్వతీపురంలో 69 మంది శతశాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా జిల్లా నుంచి 371 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 369 మంది మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మ సోమవారం చెప్పారు. విజయనగరం జిల్లా వంగర అంబేద్కర్ గురుకులానికి చెందిన పి.సంజన 572 మార్కులు, కొమరాడకు చెందిన దీపిక 557 మార్కులు, పార్వతీపురానికి చెందిన అలమండ జస్వంత్ 557 మార్కులు సాధించినట్లు ఆమె వెల్లడించారు.



తల్లిదండ్రులతో గౌతమి

(591 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని)

ఉపాధి ఈసీ సస్పెన్షన్

- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

గరుగుబిల్లి, ఏప్రిల్ 22 : గరుగుబిల్లి మండలంలో ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఈసీ (ఇంజనీరింగ్ కన్సల్ట్)గా పనిచేస్తున్న డొడ్ల శ్రీనివాసరావును కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆయన గతంలో పార్వతీపురం మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేవారు. అయితే మూడు నెలల కిందట గరుగుబిల్లి మండలానికి సంబంధించి ఈసీగా ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా కొద్ది రోజుల కిందట ఆయన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై అసభ్యకరంగా ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది. దీంతో కొమరాడ మండలం శివిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కురుపాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ రమణకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో పి.సూర్య నారాయణ విచారణ నిర్వహించి నివేదికలను నియోజకవర్గ ఎన్నికల అధి కారికి అందించారు. అయితే ఈసీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఎన్నికల నియమావళిని ధిక్కరించినట్లు నిర్ధారించారు. ఈ మేరకు అయన్ని తక్షణమే విధులు నుంచి తొలగించాలని ఎంపీడీవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ సమాచారాన్ని అందించేందుకు శ్రీనివాసరావు అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఇదిలా ఉండగా సీతానగరం మండలంలో ఉపాధి హామీ పథకంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.శ్రీనివాసరావుపై కూడా ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఆయన ముఖ్యమంత్రి జగన్, వైసీపీకి మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్లు తెలిసింది. దీనిపై అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పీపుల్స్ మేనిఫెస్టో

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



సాలూరు రూరల్: ఉద్యోగులు ప్రజల్లో భాగమే. ఏ ప్రభుత్వమైనా ఎందుకో ఉద్యోగులను విడిగా చూస్తుంది. కోట్లాది రూపాయల ఆస్తులున్న వారికి తెల్లకార్డు ఇచ్చి సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. ఉద్యోగుల విషయంలో మాత్రం భిన్నంగా ఉంటున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవాలి. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందిస్తే ఉద్యోగులకు సమస్యలు ఉండవు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చేది ఉద్యోగ యంత్రాంగమే.

- కెల్ల వెంకటేష్, విజయనగరం డీపీఎం (మెడికల్), సాలూరు

టెండర్ ఓటు.. చాలెంజ్ ఓటు

(రాజాం రూరల్)

ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియలో టెండర్ ఓటు.. చాలెంజ్ ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. టెండర్ ఓటు అంటే ఏమిటి? చాలెంజ్ ఓటు అంటే ఏమిటి? ఎలాంటి పరిస్థితుల్లో ప్రిసైడింగ్ అధికారి ఇలాంటి ఓటు వేసేందుకు అనుమతిస్తారో తెలుసుకుందాం.

చాలెంజ్ ఇలా...

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి అసలైన ఓటరు కాదని పోలింగ్ ఏజెంటుకు అనుమానం వస్తే అతని గుర్తింపును ప్రశ్నించవచ్చు. రూ.2 ప్రిసైడింగ్ అధికారికి ఫీజుగా చెల్లించి దీనిపై విచారణ కోరవచ్చు. అప్పుడు సంబంధిత ఓటరును ధ్రువీకరణ కోసం తగిన ఆధారాలు చూపించాలని కోరుతారు. ఈ విచారణలో అతను అసలైన ఓటరే అని నిర్ధారణ అయితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఇలా చేయడాన్ని చాలెంజ్ చేసే హక్కు (రైట్ టు చాలెంజ్) అంటారు. ఒకవేళ అసలైన ఓటరు కాదని తేలితే ప్రిసైడింగ్ అధికారి అతన్ని పోలీసులకు అప్పగించే అవకాశం ఉంది.

టెండర్ ఇలా...

ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లే వ్యక్తికి .. తన ఓటును అప్పటికే ఎవరో వేసినట్లు తేలితే.. అతనికి టెండర్ ఓటు వేసేందుకు వీలుంటుంది. టెండర్ ఓటు కోసం ఓటరు అడిగినపుడు ప్రిసైడింగ్ అధికారి అతనికి ఒక బ్యాలెట్ పేపర్ ఇస్తారు. ఓటు వేసిన తరువాత దీన్ని ఒక కవరులో ఉంచి సీల్ చేసి భద్రపరుస్తారు. టెండర్ ఓటును ఈవీఎంలో వేయడం సాధ్యం కాదు.

పోస్టల్ బ్యాలెట్ అంటే..

ప్రతివ్యక్తికీ ఎన్నికలలో స్వయంగా ఓటువేసే హక్కు ఉంటుంది. కానీ, అత్యవసర సేవల్లో ఉన్నవారితో పాటు కొందరు ప్రత్యేక వ్యక్తులు, కుటుంబాలు, ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్నవారు, పీడీ చట్టం కింద నిర్బంధంలో ఉన్నవారు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉంటుంది. సైన్యం, పోలీసులు వంటి శాఖలను అత్యవసర సేవల విభాగంగా పరిగణిస్తారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ప్రత్యేక వ్యక్తుల కిందకు వస్తారు.



పేరుకు.. 100 సేవలకు.. 30

- ఇదీ గజపతినగరం ఆస్పత్రి పడకల తీరు
- ఇబ్బంది పడుతున్న బాధితులు
- హామీలు నెరవేర్చని మంత్రి, ఎమ్మెల్యే
- నత్తనడకనే పనులు

'ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నాం. అన్ని సదుపాయాలతో ఆస్పత్రులను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం.'...ఇదీ సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్ నుంచి... మంత్రులు...ఎమ్మెల్యేల వరకూ...ఆఖరికి మండల స్థాయి నాయకులు సైతం ఐదేళ్లుగా ఎక్కడికక్కడ వినిపిస్తున్న పాట. కానీ వాస్తవానికి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో...ఆస్పత్రులు ఎలా ఉన్నాయో... అక్కడి సదుపాయాలు... భవనాలు ఏ స్థాయిలో ఉంటున్నాయో క్షేత్రస్థాయిలో చూస్తేనే తెలుస్తుంది. గజపతినగరంలోని 100 పడకల ఆస్పత్రి దీనికి ప్రత్యక్ష సాక్ష్యం.

(గజపతినగరం)

అది పేరుకే 100 పడకల ఆసుపత్రి.. సేవలు మాత్రం 30 పడకల్లో అందుతున్నాయి. వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నా వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఇక్కడికి వచ్చిన వారికి తూతూ మంత్రంగా చికిత్స అందించి... జిల్లా కేంద్రాసుత్రికి రిఫర్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పుకుంటున్న వైసీపీ నాయకులకు క్షేత్ర స్థాయిలో ఇది కానరాకపోవడం దురదృష్టకరం. గత టీడీపీ ప్రభుత్వం నిధులు వెచ్చించినా.. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ పనులు పూర్తి చేయలేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేలా టీడీపీ ఎమ్మెల్యే కేఏ నాయుడు గత ఎన్నికలకు ముందుకు రూ.17 కోట్లు మంజూరు చేయించారు. ఆ పనులు ప్రారంభించే దిశగా శంకుస్థాపన చేశారు. అంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిపి వేశారు.



నిర్మాణ దశలో ఉన్న ఏరియా ఆసుపత్రి భవనం

నీటి మూటలేనా?





'మా ప్రభుత్వం వచ్చింది.. పనులు వేగవంతం చేసి వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మాటలు నీటి మూటలేనా?' అంటూ నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మంగళవారం ఈ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. హామీలపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాలి.

అట్టహాసంగా శంకుస్థాపన..

2019లో వైసీపీ అధికారం చేపట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి బొత్స సత్యనారాయణ 2020లో రెండో పర్యాయం ఇవే పనులకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. దీంతో పనులు త్వరతిగతిన చేపట్టి మెరుగైన సేవలు అందుతాయని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూశారు. ఐదేళ్ల గడిచినా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఏరియా ఆసుపత్రికి తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నా పడకలు లేకపోవడంతో చికిత్స కోసం వచ్చేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గజపతినగరం నియోజకవర్గం పరిధిలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలతో పాటు సాలూరు నియోజకవర్గంలోని చెందిన మెంటాడ మండలానికి చెందిన ప్రజలు ఇదే ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. ప్రతి రోజూ 300 నుంచి 350 వరకు ఓపీ ఉంటుంది. రోగుల సంఖ్య పెరగడం.. ఆ స్థాయిలో వైద్య సేవలు అందించలేక జిల్లా కేంద్ర ఆసుపత్రికి, లేకుంటే ఘోషాసుపత్రికి చికిత్స కోసం వెళ్లాల్సి వస్తుందని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు వస్తే ఉన్న 30 పడకలు చాలకపోవడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స అందించాల్సి వస్తుందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. నియోకవర్గ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆసుపత్రి కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నా.. వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దే దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తిరిగి ఎన్నికలు వచ్చేంతవరకు నెరవేర్చక పోవడంపై నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు(ఫైల్)



శబ్దం మోతాదు మించితే కేసు

విజయనగరం: ప్రస్తుతం అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రూపాల్లో ప్రచార ఉధృతి పెంచారు. పెద్ద శబ్దాలతో ప్రచార సాధనాల ద్వారా తమ హామీలను వివరిస్తున్నారు. ఈ శబ్దాలు శృతిమించడంతో సామాన్యులకు అవస్థలు తప్పడంలేదు. చట్టపరంగా నిర్దేశిత ప్రాంతాల్లో ఏ మేరకు ధ్వని వినియోగించాలో ప్రత్యేక నిబంధనలకు ఈసీ రూపకల్పన చేసింది. నివాస ప్రాంతాల్లో 45-55 డెసిబుల్స్ దాటరాదు. వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40-50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55-65, పారిశ్రామిక ప్రాంతంలో 70-75 డెసిబుల్స్ ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. అందుకే అభ్యర్థులు, ప్రచారకర్తలు అప్రమత్తంగా ఉండాలి.

ఈసీ ప్రత్యేకత అదే..



భారతదేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ ఎన్నికల సంఘం. ఎన్నికల సమయంలో తన విశేష అధికారాలను వినియోగించుకుంటుంది. ఎవరికీ భయపడని రాజకీయ నాయకులు ఎన్నికలు వచ్చాయంటే ఈ సంఘానికి మాత్రం భయపడతారు. ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత మాజీ కమిషనర్ టీఎన్ శేషన్‌దే. భారత ఎన్నికల సంఘ ప్రధాన అధికారిగా ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. రాజకీయ పార్టీలను గడగడలాడించారు.

- శృంగవరపుకోట

తెలుసుకుందాం

డిపాజిట్ గల్లంతంటే ఏంటి?


(విజయనగరం)

ఎన్నికల్లో అభ్యర్థులు ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా రాదని చెబుతుంటారు. మరి డిపాజిట్ గల్లంతు అంటే ఏంటి? డిపాజిట్‌కు అవసరమైన ఓట్లు రాకపోతే ఏం జరుగుతుంది. ఎన్నికల ఫలితాల ప్రకటించిన సమయంలో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను అధికారులు ప్రకటిస్తారు. ఆ సమయంలో డిపాజిట్‌కు అవసరమైన ఓట్లు కూడా అభ్యర్థికి రాలేదని వింటాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ ఫారంతో పాటు నిర్దేశిత డిపాజిట్ (ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎన్నికల్లో పోలైన వాటిలో చెల్లిన ఓట్లలో ఆరో వంతుకు మించితే ఆ అభ్యర్థి చెల్లించిన డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. లేకుంటే ఆ డిపాజిట్‌ను ఎన్నికల సంఘమే జప్తు చేసుకుంటుంది. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితం చేసిన తర్వాత మాత్రమే అర్హులైన అభ్యర్థులకు డిపాజిట్‌ను తిరిగి ఇచ్చేస్తారు.




ఆ బ్యాలెట్‌లో గుర్తులుండవ్..!

విజయనగరం: గుర్తులు లేకుండా ఎన్నికలు ఏంటా అని సందేహం రావచ్చు. అవును నిజమే.. పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు వేసే ఓటే పోస్టల్ బ్యాలెట్. ఇంతకుముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకూ ఇచ్చే వారు. వచ్చిన వాటిల్లో చివరి వాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందజేసేవారు. ఈవీఎం యంత్రాలు వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు యంత్రంలో ఓటువేసే పరిస్థితి లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని బట్టి వారి ప్రాంతాల్లో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.



పోలింగ్ బూత్‌లో 1400 ఓట్లే ఎందుకు?

విజయనగరం: ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్. ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పని చేసే వీవీ ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.



నా అభిమానం కొద్దీ..!

బేబినాయనకు ఉపాధి వేతనదారుడి విరాళం

- ఆ రూ.1300ను నామినేషన్ రుసుంగా వెచ్చించిన వైనం

బొబ్బిలి: బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బేబీనాయనకు ఉపాధి హామీ పథకం వేతనదారుడు తన వారం రోజుల సంపాదనను విరాళంగా అందజేసి అభిమానాన్ని చాటుకున్నాడు. బొబ్బిలి మండలం నారసింహునిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా... అదే గ్రామానికి చెందిన కొండపల్లి జగన్నాథం రూ.1300ను బేబీనాయనకు విరాళంగా అందజేశాడు. తాను వారం రోజులపాటు ఉపాధి పనులకు వెళ్లి వేతనంగా సంపాదించిన మొత్తాన్ని ఆయనపై అభిమానంతో అందజేస్తున్నానని ప్రకటించాడు. దీనికి ఉబ్బితబ్బిబ్బయిన బేబీనాయన మాట్లాడుతూ ఈ అభిమానానికి వెల కట్టలేమని అన్నారు. జగన్నాథం విరాళంగా ఇచ్చిన మొత్తాన్ని జగన్నాథస్వామి ప్రసాదంగా భావించి తన నామినేషన్ రుసుం కోసం వినియోగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, గ్రామ టీడీపీ నాయకుడు రెడ్డి మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని చూపిస్తున్న వేతనదారుడు జగన్నాథం

ఓటరు గుర్తింపు కార్డుకు 29 ఏళ్లు

విజయనగరం: దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు స్వయం ప్రతిపత్తితో కూడిన ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకువస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడంతో ఎన్నికల నిర్వహణ సంక్లిష్టంగా ఉంటుంది. ఈనేపథ్యంతో ప్రతిఓటరును గుర్తించేందుకు, దొంగఓట్లను అరికట్టేందుకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. ఈ గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 29 సంవత్స రాలు పూర్తయ్యింది. ఓటరు జాబితాల్లో ఉన్న క్రమ సంఖ్య ప్రకారం ఫొటోను కార్డుపై ముద్రించి ఇస్తున్నారు. ఐడీ కార్డుపై పాస్‌పోర్టు సైజు ఫొటో, జనన తేదీ, చిరునామా సైతం ముద్రిస్తారు. సీరియల్ నంబరు, హోలోగ్రామ్ స్టిక్కర్, కార్డును జారీచేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటా యి. దీనిపై ముద్రించిన సీరియల్ నంబరు చాలాము ఖ్యం. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా డేటాను ఆన్‌లైన్‌లో ఉంచ డంతో ఓటరు ఎన్నికల సంఖ్య, సీరియల్ నంబర్‌ను సులభం గా తెలుసుకుంటున్నారు. వీటి స్థానంలో మారుతున్న సాం కేతిక పరిజ్ఞానం వినియోగించి ఎన్నికల సంఘం ప్రతి ఓట రు ఒక గుర్తింపు నెంబరుతో ఎపిక్ కార్డును ప్రస్తుతం జారీ చేస్తోంది. 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డు అందజే స్తున్నారు. దీనిని ఇతర ప్రభుత్వ పథకాలను పొందేందుకు, భారతీయ పౌరుడిగా గుర్తింపు కోసం, చిరునామా కోసం అధికారికంగా వినియోగించుకోవచ్చు.



ఎవరో.. బొబ్బిలి పులి

- చారిత్రక ప్రాధాన్యం బొబ్బిలి సొంతం
- 'ఉమ్మడి' మద్రాసు ముఖ్యమంత్రి మన జమీందారు
- రాజకీయ చైతన్యానికి మారుపేరు
- ఈసారి ఎవరికి పట్టం కట్టేనో..

ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు:	2,28,829
పురుషులు:	1,13,027
మహిళలు:	1,17,791
ఇతరులు:	11

(బొబ్బిలి)

విజయనగరం జిల్లాలో బొబ్బిలికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. పౌరుష.. పరాక్రమాలకు పెట్టింది పేరుగా నిలిచింది. విజయనగరం రాజులతో పోరాడిన చరిత్ర దీని సొంతం. బొబ్బిలి-విజయనగరం రాజుల మధ్య జరిగిన యుద్ధం చరిత్రలో బొబ్బిలి యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. రాజకీయంగానూ తొలినుంచీ చైతన్యం కలిగిన ప్రాంతం. అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన బొబ్బిలి వీణలు తయారయ్యేది ఇక్కడే. చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరు. పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. చెరకు పంట దిగుబడిలో రికార్డులు సృష్టించిన ఘనత బొబ్బిలిది. 60, 70 ఏళ్ల క్రితమే ఈ ప్రాంతంలో పంచదార, జనపనార పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. వెంగళరాయ సాగర్, తోటపల్లి, పారాది, వేగావతి తదితర నదులు, ప్రాజెక్టుల నుంచి సాగునీటి సౌకర్యాల కల్పన ఇంకా కొనసాగుతూనే ఉంది. రైతులు, రైతు కూలీలు, ఇతర చేతి వృత్తులు, స్వయం ఉపాధి వారు ఎక్కువగా ఉన్నారు.

పురాతన విమానాశ్రయం

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బాడంగిలో రెండో స్వాతంత్ర్య యుద్ధ సమయంలో నిర్మించిన విమానాశ్రయం వృథాగా పడి ఉంది. గతంలో అక్కడ పెద్ద ఎత్తున గోధుమలను నిల్వ చేసేవారు. 1990వ దశకంలో బొబ్బిలి పట్టణంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనకు గ్రోత్‌సెంటరును ఏర్పాటు చేశారు. నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీనిని ప్రారంభించారు. అప్పట్లో కేంద్రంలో జలగం వెంగళరావు పరిశ్రమల మంత్రిగా ఉండేవారు. ఆయన సహకారంతోనే గ్రోత్‌సెంటర్ మంజూరైంది.

ముఖ్య కార్యాలయాలు ఇక్కడే...

బొబ్బిలి ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు రాష్ట్ర కేబినెట్‌లో ఇరిగేషన్, విద్య, హోం శాఖామాత్యులుగా పనిచేశారు. ఆయన ఈ ప్రాంతంపై మక్కువతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కలిపి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంతో పాటు విద్యుత్, విద్యాశాఖ, పశుసంవర్ధక శాఖకు చెందిన డివిజన్ కార్యాలయాలను బొబ్బిలికి మంజూరు చేయించారు.

- వెంగళరాయసాగర్, జంఝావతి, పెద్దగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టుల మంజూరులో కీలక పాత్ర పోషించారు.


'ఉమ్మడి' ముఖ్యమంత్రిగా...

మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా బొబ్బిలి జమీందార్ రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు పనిచేశారు.

బొబ్బిలి ఎమ్మెల్యేలుగా వీరే..		
సం.	అభ్యర్థి	పార్టీ
1955	కోటగిరి సీతారామస్వామి	కాంగ్రెస్
1962	తెంటు లక్ష్మునాయుడు (సీనియర్)	కాంగ్రెస్
1967	ఎస్ఆర్‌కేఆర్ రావు	ఇండిపెండెంట్
1972	చెలికాని వెంకట కృష్ణారావు	కాంగ్రెస్
1978	కొల్లి వెంకటకూర్మినాయుడు	జనతా
1983	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	టీడీపీ
1985	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	టీడీపీ
1989	పెద్దింటి జగన్మోహనరావు	కాంగ్రెస్
1994	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	టీడీపీ
1999	పెద్దింటి జగన్మోహనరావు	కాంగ్రెస్
2004	ఆర్‌వీఎస్‌కే రంగారావు	కాంగ్రెస్
2009	ఆర్‌వీఎస్‌కే రంగారావు	కాంగ్రెస్
2014	ఆర్‌వీఎస్‌కే రంగారావు	వైసీపీ
2019	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	వైసీపీ

ఇలా మారిపోయాయి..

సాలూరు నియోజకవర్గంలో ఉండే రామభద్రపురం మండలం బొబ్బిలి అసెంబ్లీలో విలీనమైంది. ప్రత్యేకంగా ఉండే తెర్లాం అసెంబ్లీ నియోజకవర్గం రద్దయింది. ఆ నియోజకవర్గంలో ఉండే బాడంగి, తెర్లాం మండలాలు బొబ్బిలిలో విలీనమయ్యాయి. మెరకముడిదాం, గరివిడి, గుర్ల మండలాల్లో కొన్ని గ్రామాలు చీపురుపల్లి నియోజకవర్గంలో కలిసిపోయాయి. దత్తిరాజేరు మండలంలో కొన్ని గ్రామాలు తెర్లాం నియోజకవర్గంలో ఉండేవి. ఆ నియోజకవర్గం రద్దు కావడంతో ఆ గ్రామాలు గజపతినగరం నియోజకవర్గంలో కలిశాయి.



బొబ్బిలి కోట



ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్

బొబ్బిలి...రెండు తెలుగు రాష్ట్రాలలో... ఆమాటకొస్తే దేశంలోనే ఈ పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 'బొబ్బిలి యుద్ధం'తో చారిత్రకంగా ఈ ప్రాంతానికి ఎంత ప్రాధాన్యం ఉందో... రాజకీయంగానూ అంతే ప్రాముఖ్యం ఉంది. పౌరుషం...అనే పదానికి పర్యాయపదంగా బొబ్బిలిని పిలుస్తారు. ఇప్పటికీ ఈ ప్రాంత రాజకీయాలు బొబ్బిలి రాజుల కనుసన్నలలోనే కొనసాగుతుండడం విశేషం.

కలుపుగోలుగా ఉండేవారు...

పెద్దల మాట

సాలూరు రూరల్: 1967వ సంవత్సరం నుంచి ఓటు వేస్తున్నాను. ఓటు వేయడానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగారమ్మపేటకు వెళ్లేవారం. పోటీ చేసే వారు రిక్షాలు ఏర్పాటు చేసేవారు. వాటిలో వెళ్లేవారం. ఏ పార్టీ రిక్షాలో వెళితే... దానికే ఓటు వేసేవాళ్లం. పోటీ చేసే వారు సైతం ఏ రిక్షాలో వచ్చినా ఆప్యాయంగా పలుకరించే వారు. అభ్యర్థులు అందరూ కలుపుగోలుగా ఉండేవారు. ఇప్పుడులా కడుపుమంట (అసూయ, కక్ష) ఉండేది కాదు. కాలం మారిపోయింది. ఇప్పుడు ఓటర్లను పోటీ చేసిన వారే విభజించుకుంటున్నారు. ఓటు అడిగిన తీరులో మార్పు గమనిస్తున్నాం.



- బలగ చిలకమ్మ (93), సాలూరు

జన కేతనం

ఆంధ్రజ్యోతి


బొబ్బిలి నియోజకవర్గ ముఖచిత్రం



కొల్లి వెంకట కూర్మినాయుడు



తెంటు లక్ష్మునాయుడు (సీనియర్)



బొబ్బిలి నియోజకవర్గ మ్యాప్



పెద్దింటి జగన్మోహనరావు



ఆర్‌వీఎస్‌కే రంగారావు



శంబంగి వెంకట చిన అప్పల నాయుడు

ఆయన హయాంలోనే పారాది, సీతానగరం తదితర ప్రాంతాలలో నదులపై వంతెనలను నిర్మించారు. గొలుసుకట్టు చెరువుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సంస్థానం ఉన్నత పాఠశాల, కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకున్న వారు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

- ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే బొబ్బిలిలోని ప్రైవేట్ చక్కెర పరిశ్రమలను జాతీయం చేశారు.
- 1951లో పునర్విభజన జరిగినప్పుడు బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటైంది. 1952లో మద్రాసు స్టేట్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పరిధిలో ఉండేది. అప్పట్లో మొత్తం 61,326 మంది ఓటర్లు ఉండేవారు. సోషలిస్టు పార్టీ తరఫున కొల్లి వెంకటకూర్మినాయుడు 18,263 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనకు అప్పట్లో 4,386 మెజార్టీ వచ్చింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన కోటగిరి సీతారామస్వామికి 13,877 ఓట్లు వచ్చాయి. కృషికార్ లోక్ పార్టీ తరఫున ఆంజలా వెంకటేశన్ పోటీ చేయగా... ఆయనకు 4,770 ఓట్లు వచ్చాయి.
- ఈ నియోజకవర్గంలో బొబ్బిలి పట్టణం, మండలం, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలు ఉన్నాయి. అసెంబ్లీ నియోజవర్గాల పునర్విభజనకు మునుపు బొబ్బిలిలో బొబ్బిలి, సీతానగరం, బలిజిపేట మండలాలు ఉండేవి. పునర్విభజన తరువాత బలిజిపేట, సీతానగరం మండలాలు పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనమయ్యాయి.



వేణుగోపాలస్వామి ఆలయం

'ఆత్మీయత' ఓ నాటకం!

ఎట్టెట్టా

విజయనగరం (ఆంధ్రజ్యోతి): 'అనుబంధం.. ఆత్మీయత..అంతా ఓ బూటకం' అన్నాడో సినీ కవి. అనుబంధం సంగతి ఎలా ఉన్నా.. ప్రస్తుత ఎన్నికల సమయంలో 'ఆత్మీయత' మాత్రం ఓ నాటకమేనన్నది అక్కడక్కడా చోటుచేసుకుంటున్న 'రాజకీయ' సంఘటనలను బట్టి తెలుస్తోంది. ఈ మాటల్లో నిజమెంతో తెలియాలంటే... ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఎత్తుగడలు చూస్తే చాలు. ఓవైపు అభ్యర్థి ఖర్చులపై ఎన్నికల కమిషన్ నిఘా...మరోవైపు పైసలు తీయకపోతే 'కార్యకర్తలు' కరువైపోయే పరిస్థితి. ఇది పోటీలో ఉన్న వారికి మింగుడు పడడం లేదు. అందుకే తాజాగా నాయకులు 'ఆత్మీయ సమావేశాల'ను ఎంచుకుంటున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న ఓ బడా నేత బంధువు నామినేషన్ వేయడానికి భారీ సంఖ్యలో జనాలను తరలించారు. ఆ రోజు వచ్చిన 'పెయిడ్' కార్యకర్తలందరికీ మద్యం, బిర్యాని, డబ్బులు ఇవ్వాలనేది ఒప్పందం. ఈ విషయాన్ని అధికారులు గుర్తించకుండా ఉండేందుకు ఓ కార్యకర్త పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు కథ నడిపారు. నామినేషన్ వేసిన తరువాత జనాలకు నేరుగా డబ్బులు ఇవ్వకుండా... నియోజకవర్గానికి సమీపంలోని తోటలో పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. మందు, విందు ఏర్పాటు చేసి... ఆ నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల పెద్దలకు నగదు అందజేసి.. 'ఆత్మీయ సమావేశం' పూర్తి చేశారు.



అమ్మా.. అమ్మా.. మాయమ్మా!

(చీపురుపల్లి)

ఏ పార్టీ అయినా.. నాయకులెవరైనా.. ఎన్నికల్లో పోటీ చేసేవారు ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవాల్సిందే. స్థానికులైనా, బయటి నుంచి వచ్చి బరిలో నిలిచిన వారైనా ఇది ఇక్కడి ఆనవాయితీ. ప్రచారం ప్రారంభించాలన్నా.. నామినేషన్ పత్రాలు సమర్పించాలన్నా.. ముందుగా అమ్మవారిని దర్శించుకుని.. ఆశీస్సులు తీసుకోవడం ఇక్కడి నాయకులకు అలవాటు. కొన్ని దశాబ్దాలుగా ఈ సంప్రదాయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు అనుసరిస్తున్నారు. దీనిలో భాగంగానే చీపురుపల్లిలో కాలు మోపిన కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం విజయనగరంలో నామినేషన్ వేసిన వైసీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ కూడా ముందుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మొదట్లో నమ్మకంతో నిర్వహించిన ఈ ప్రక్రియ రాను రాను సంప్రదాయంగా మారిపోయింది.

22 సిపిపి 2: చీపురుపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం



చీపురుపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం



బొబ్బిలి: పార్టీ శ్రేణులతో ఊరేగింపుగా వెళ్తున్న బొబ్బిలి టీడీపీ అభ్యర్థి బేబీనాయన, పక్కన ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

నామినేషన్ల పర్వం



విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి...తమ అభిమాన నేతలకు అభినందనలు తెలిపారు.





నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న కురుపాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్

'పది'లో మెరిశారు

● పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలు సోమవారం వెలువడగా, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తాచాటిన గిరిజన విద్యార్థులు

సీతంపేట: పదో తరగతి ఫలితాల్లో గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. 12 ఆశ్రమ పాఠశాలలకు చెందిన 595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 561 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. మిగతా 34 మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణులు ఉత్తీర్ణత సాధించారు. మూడు గురుకుల పాఠశాలలకు చెందిన 267 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 266 మంది ప్రథమ శ్రేణిలో పాసయ్యారు. ఒక విద్యార్థి ద్వితీయ శ్రేణిలో పాసయ్యారు. వీరిలో సీతంపేట ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన టి.చందు 563 మార్కులు, సీతంపేట ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన బిడ్డిక మౌనిక 562, సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బి.జాన్ 571 మార్కులు సాధించారు. ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు అన్నదొర, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి మంగవేణి, పీఎంఆర్సీ కోఆర్డినేటర్ కోటిబాబు, పాఠశాలకు చెందిన హెచ్ఎంలుకు గురుకులాలకు చెందిన ప్రిన్సిపాల్స్, విద్యార్థులకు అభినందించారు. ● **జియ్యమ్మవలస:** బీజేపురం జడ్పీ హైస్కూల్, చినమేరంగి కేజీబీవీ, టీకే జమ్ము, జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. పెదమేరంగి జడ్పీ ఉన్నత పాఠశాల 99 శా తం, జియ్యమ్మవలస 98 శాతం, చినకుదమ, పెదబుడ్డిడి 95 శాతం, చినమే రంగి 94 శాతం, పిప్పలభద్ర 92 శాతం, వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల 88 శాతం, ఆర్ఆర్బీ పురం జీటీడబ్ల్యూఏ బాలుర హైస్కూల్ 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. బీజే పురం హైస్కూల్‌కు చెందిన కె.నిషిత 578 మర్కులు సాధించింది. ● **కొమరాడ:** పదో తరగతి పరీక్షలో మాదలంగి జడ్పీ ఉన్నత పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించగా, అదే పాఠశాలకు చెందిన తెర్లి సాహితి, హేమంత్‌కుమార్ పండాకు చేరో 586 మార్కులు వచ్చినట్లు ఎంఈవో నారాయణస్వామి తెలిపారు. మండల వ్యాప్తంగా 508 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 489 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన చెప్పారు. ● **సాలూరు రూరల్:** పదో తరగతి ఫలితాల్లో సాలూరు మండలంలోని పాఠశాలలు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాయి. శివరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల శతశాతం ఫలితాలను సాధించినట్లు హెచ్ఎం ఆలమూరి ఉమామహేశ్వరరావు చెప్పారు. ఈ పాఠశాలకు చెందిన వై.హిమజ 528 మార్కులు సాధించింది. మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మారోజు వరుణ్ 552 మార్కులు పొందాడు. పురోహితునివలస ఆదర్శ పాఠశాల విద్యార్థిని కందుల మౌనిక 583 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.అంజలిదేవి తెలిపారు. తమ పాఠశాల నుంచి 92 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 90 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఇమాంది దేవయాని 579 మార్కులు పొందినట్లు ఆమె తెలిపారు. ●

11 పాఠశాలల్లో శతశాతం



జి.విశాలక్ష్మి (568)

గరుగుబిల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మండలంలోని 11 పాఠశాలలు 98 శాతం ఉత్తీర్ణత సాధించాయి. కొత్తూరు, మార్కొండపుట్టి ఉల్లిభద్ర పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. రావుపల్లిలో 99 శాతం, తోటపల్లిలో 99 శాతం, గరుగుబిల్లిలో 97.64 శాతం, రావివలసలో 95 శాతం, నాగూరులో 93 శాతం, రావివలస కేజీబీవీ శతశాతం ఉత్తీర్ణత సాధించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించగా, ఆ పాఠశాలకు చెందిన టి.దివ్య 551 మార్కులు సాధించింది. ప్రథమ శ్రేణిలో 78మంది, ద్వితీయ శ్రేణిలో ఒకరు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి తెలిపారు. జి.కీర్తన 544, ఎ.లక్ష్మి 542 మార్కులు సాధించారు. కేజీబీవీలో కె.వసుంధర 544, ఎన్.చంద్రిక 516, బి.చిన్ని 514 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.ఛాయాదేవి తెలిపారు. కొత్తూరు పాఠశాలకు చెందిన జి.విశాలాక్షి 568 మార్కులు, గరుగుబిల్లికి చెందిన జి.ధన్యశ్రీ 561 మార్కులు సాధించారని ఎంఈవో ఎస్.నాగభూషణరావు తెలిపారు.

ఎం.సింగుపురం పాఠశాలలో



మనోజ్‌కుమార్ (588)

పాలకొండ: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎం.సింగుపురం జడ్పీ ఉన్నత పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ పాఠశాలకు చెందిన సవిరిగాన మనోజ్‌కుమార్ 588, దుంప రమ్య 586 మార్కులు సాధించారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కె.ఆదిత్య 567, పాలకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి.ఝాన్సీ 579, పాలకొండ జడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన కె.ఝాన్సీరాణి 562 మార్కులు సాధించారు. చినమంగళాపురం జడ్పీ హెచ్ఎస్‌కు చెందిన భవానీ 575 మార్కులు సాధించింది.

గుమ్మలక్ష్మీపురం: పదో తరగతి పరీక్షల్లో గుమ్మలక్ష్మీపురం మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 71 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలలో ఎస్.ప్రణీత్ 536 మార్కులు సాధించాడు. భద్రగిరి పీటీజీ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించింది. గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 54 మందికిగాను 49 మంది ఉత్తీర్ణత పొందారు. అలాగే భద్రగిరి పీటీజీ పాఠశాలలో మూటక లావణ్య 555 మార్కులు సాధించింది. భద్రగిరి పీటీజీ గురుకుల పాఠశాలలో ఆడ్డాకుల బిందుమతి 567 మార్కులు సాధించింది. ●

ఉత్తమ ఫలితాలు సాధించిన మున్సిపల్ విద్యార్థులు




కుసుమలత (586), తేజశ్వని (579)

పార్వతీపురంటౌన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మన్యం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్టు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. తిరుమళ్ల రామ్మూర్తి బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 90 మందికిగాను 86మంది ఉత్తీర్ణత సాధించగా, అందులో 70 మంది ప్రథమ స్థానంలో నిలిచారు. కె.గౌతమి 600 మార్కులకుగాను 591 మార్కులు సాధించింది. అలాగే పట్టణంలోని కొత్తవలస కొత్తపోలమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 172 మందికిగాను 166 మంది ఉత్తీర్ణత సాధించగా, అందులో 58 మంది ప్రథమ స్థానంలో నిలిచారు. వి.కుసుమలత 586 మార్కులు, డిజాహ్నవి 574, పి.కావ్యశ్రీ 573, వి.భవన్ 573 మార్కులు సాధించినట్టు హెచ్ఎం అప్పలనాయుడు తెలిపారు. డీవీఎంఎం ఉన్నత పాఠశాల నుంచి 85 మందికిగాను 81మంది ఉత్తీర్ణత సాధించగా, అందులో 61 మంది ప్రథమ స్థానంలో నిలిచారు. వీవీ తేజశ్వని 579 మార్కులు సాధించినట్టు హెచ్ఎం గోవిందరావు తెలిపారు.

మక్కువ: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు 219 మంది హాజరుకాగా, 152 మంది ప్రథమ, 37 మంది ద్వితీయ, 12 మంది తృతీయ స్థానాల్లో నిలిచారు. గొర్లె పూజిత 579 మార్కు లు, చోడిపల్లి సంజీ 575 మార్కులు సాధించారు. ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో 94 మందికిగాను 94 మంది పాసయ్యారు. కాశీపట్నం కేజీబీవీలో 35 మందికి 34 మంది ఉత్తీర్ణత సాధించారు. ● **కురుపాం:** పది ఫలితాల్లో కురుపాం విద్యార్థులు సత్తా చాటారు. కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వడ్డి అనూష 586, గ్రంధి కృపా జ్యోతి 575 మార్కులు సాధించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థిని వై.యోషిత 577 మార్కులు సాధించింది. జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, మహాత్మా జ్యోతి బాపూలే బీసీ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించగా, కేజీబీ వీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. కురుపాం గ్రామానికి చెందిన వడ్డి రవి కూమార్తె వడ్డి అనూష 586 మార్కులు సాధించింది. ● **బలిజిపేట:** మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో 431మందికిగాను 404 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అజ్జాడ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన సీహెచ్ మేఘన 582 మార్కులు సాధించింది. పెదపెంకి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అఖిల 579 మార్కులు సాధించింది. ● **వీరఘట్టం:** నీలానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దుప్పాడ సంజన 587 మార్కులు సాధించింది. నీలానగరం, బిటివాడ, కత్తులకవిటి, తలవరం, తెట్టంగి, వండువ పాఠశాలలు, గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, రేగులపాడు కేజీబీవీ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.



తెర్లి సాహితి (586)



హేమంత్‌కుమార్ (586)



మౌనిక (583)



దేవయాని (579)



సీహెచ్ మేఘన (582)



తల్లిదండ్రులతో వడ్డి అనూష (586)



సంజన(587)కు స్వీట్ తినిపిస్తున్న తండ్రి

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది వంతెన సమీపంలో జొన్న లోడుతో వెళ్తున్న ఓ లారీ వెనుకకు మళ్లిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం నేలకొరిగి, వైర్లు కింద పడ్డాయి. ఎవరికీ ఎటువంటి అపాయం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అంచనాలు రూపొందించి స్తంభం నేలకొరగడానికి కారణమైన లారీ యజమాని నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

వీరఘట్టం: తెట్టంగి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు సుంకర్ల పాపినాయుడు, సుంకర్ల ఆదినారాయణ, అల్లు వెంకునాయుడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్థులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేశారు. వెంటనే పాలకొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

29 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

గరుగుబిల్లి: రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ సంచాలకుడు ప్రసన్నకుమార్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నామని మండల కేంద్రం శాఖా గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ముందుగా సంబంధిత పాఠశాలల హెచ్ఎంలను కలిసి గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నామని చెప్పారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలను ప్రతి రోజు ఉదయం 8 గంటల నుచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మస్తర్లలో తేడాలు ఉంటే చర్యలు తప్పవు



మస్తర్లను పరిశీలిస్తున్న శ్రీహరినాయుడు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకానికి సంబంధించి వేతనదారుల మస్తర్లలో తేడాలు ఉంటే చర్యలు తప్పవని మన్యం జిల్లా ఉపాధి హామీ పథకం సహాయ పథక సంచాలకుడు గుంట్రెడ్డి శ్రీహరినాయుడు హెచ్చరించారు. గరుగుబిల్లి, ఉద్దవోలు గ్రామాల్లో మస్తర్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో వేతనదారులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వేతనదారులు విధిగా రెండు పూటలా సమయపాలన పాటించాలన్నారు. గరిష్ఠ వేతనం రూ.300లు పొందేందుకు ముందస్తు కొలతలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోకుంటే క్రమ శిక్షణ చర్యలు తప్పవన్నారు. ● **మక్కువ:** మస్తర్లలో తేడాలు వస్తే చర్యలు తప్పవని ఉపాధి ఏపీవో ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని శంబర, ఎస్.పెద్దవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గరిష్ఠ వేతనం దక్కేలా వేతనదారులకు కొలతలు ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా నీడ, నీరు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మీ ఇంటి ఆడపిల్లగా అవకాశం ఇవ్వండి

● కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



ప్రచారంలో పాల్గొన్న సంధ్యారాణి

సాలూరు: మీ ఇంటి ఆడపిల్లగా ఒక్క అవకాశం ఇవ్వాలని అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పట్టణంలో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలి

ఈనెల 25న తన నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు సోమవారం సాలూరులోని తన నివాసం వద్ద ముఖ్య నాయకులతో ఆమె సమావేశం అయ్యారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పాచిపెంట మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, మక్కువ మండల అధ్యక్షుడు గుళ్ల వేణు, మెంటాడ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు



శ్రీదేవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. అనూహ్యంగా సోమవారం పార్వతీపురం పట్టణానికి చెందిన చర్మకారుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డి.శ్రీదేవి తన అనుచరులతో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారిని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఎ.తాతబాబు తన అనుచరులతో టీడీపీలోకి చేరారు. ఎంఆర్‌నగర్ నుంచి పలువురు టీడీపీ గూటికి చేరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం రూరల్:** పెద్దబండపల్లి గ్రామానికి చెందిన గౌరీశంకరరావుతో పాటు వైసీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎండ్రపు ప్రవీణ్‌కుమార్ సుమా రు వంద కుటుంబాలతో టీడీపీలోకి చేరారు. వీరందరికీ బోనెల విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి నాయకులు బోనుదేవీ చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, ఉదయ్‌కుమార్, కొత్తడ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● **బలిజిపేట:** అజ్జాడ గ్రామంలో వైసీపీ గ్రామ అధ్యక్షుడు అక్కెన జగన్మోహనరావు, ఎంపీటీసీ అక్కెన గణేష్ ఆధ్వర్యంలో సుమారు 400 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు కోరారు. సోమవారం రాత్రి మండలంలోని రావుపల్లిలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు విఘాతం కల్పించరాదన్నారు. ఘర్షణలకు తావు లేకుండా వ్యవహరించాలన్నారు. నిబంధనలు ధిక్కరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బొమ్మలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

బలిజిపేట: తుమరాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన బొమ్మలమ్మతల్లి ఆలయంలోని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమితోనే సంక్షేమం: జయకృష్ణ

● జనసేనలోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జయకృష్ణ

వీరఘట్టం: నర్సిపురం గ్రామంలో నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. వీరికి జయకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి, ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింత ఉమా, నివర్తి శశి, జానీ, తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** మండల కేంద్రానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం రాత్రి జనసేన పార్టీలో చేరారు. జనసేన పాలకొండ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి చెందిన వీరఘట్టం మేజర్ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ దౌలూరి రామకృష్ణ, సీనియర్ నాయకుడు, మేజర్ పంచాయతీ మాజీ అధ్యక్షుడు డి.సత్యారావు, వైసీపీ నాయకుడు పి.పురుషోత్తం తదితరులు తమ అనుచరులతో జనసేనలో చేరారు.

టీడీపీ నాయకుల ప్రచారం

పాలకొండ: గ్లాసు గుర్తుకు ఓటువేసి కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. పట్టణంలోని 9వ వార్డు నాగవంశపు వీధి, బాయికట్టు వీధుల్లో వారు సోమవారం ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, గంటా సంతోష్, తేజోవతి, ఆనాపు జవరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే జిల్లాపై దృష్టి సారిస్తాం

● కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కేంద్రంలో మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వం పగ్గాలు చేపట్టడం ఖాయమని, అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖామంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే అన్నారు. అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత నామినేషన్ సందర్భంగా జిల్లాకు వచ్చిన ఆయన సోమవారం అరకు పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కొత్తపల్లి గీత నిజమైన గిరిజన బిడ్డ అని, కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అంతకుముందు నామినేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తనవిగా చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటోందన్నారు. అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత మాట్లాడుతూ తనతో పాటు అరకు పార్లమెంట్ పరిధిలో శాసనసభ స్థానాలకు పోటీ చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు ద్వారపురెడ్డి జగదీష్, పార్వతీపురం, పాలకొండకు చెందిన టీడీపీ, జనసేన అభ్యర్థులు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, రంపచోడవరం టీడీపీ అభ్యర్థి శిరీష, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్ రావు, పార్టీ నాయకుడు చందక అనీల్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డి.శ్రీదేవి, బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** జిల్లా పరిధిలోని పలు సమస్యలను కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రాంత గిరిజన సమస్యలను ఆయనకు వివరించారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సాలూరు రూరల్: ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ ప్రసన్న మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

బీజేడీ నుంచి కొండబాబు సస్పెన్షన్



కార్యకర్తలతో కొండబాబు

రాయగడ: బిజూ జనతాదళ్ సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వరరావు (కొండబాబు)ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కొండబాబు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కోణంలో, రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి, రాష్ట్ర సీనియర్ జనరల్ సెక్రటరీ జిల్లా ఎన్నికల పరిశీలకుడు అతాను సవ్యసాచి నాయక్ కొండబాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల కిందట రాయగడ వచ్చిన మంత్రికి కొండబాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇంతలోనే కొండబాబును సస్పెండ్ చేయడంతో రాజకీయ వర్గాలు ఆశ్చర్యానికి గురయ్యాయి. దీంతో పట్టణంలో రాజకీయాలు వేడెక్కాయి ఏం జరుగుతుందో అని రాజకీయ విశ్లేషకులు ఎదురు చూస్తున్నారు. తనకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని కొండబాబు పేర్కొన్నారు. అతను ముందుగా నిర్ణయించుకున్న మేరకు పట్టణంలో ఆదివారం కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అనేకమంది ప్రజలు యువకులు కొండబాబు సమక్షంలో బిజద తీర్థం పుచ్చుకున్నారు. త్వరలో తన భవిష్యత్తు కార్యచరణపై వివరిస్తానని కొండబాబు తెలిపారు.

ఒడిశా

చోరీ సొత్తు స్వాధీనం

రాయగడ: చందిలి పోలీసు స్టేషన్ పరిధి ముకుందపూర్ గ్రామంలో ఈనెల 17 రాత్రి తన జనసేవా కేంద్రంలో చోరీ జరిగిందని, రూ.లక్షా 70వేలు చోరీకి గురైందని యజమాని లక్ష్మణ బెహెరా 18వ తేదీన చందిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పద్మాపూర్‌కు చెందిన పులక పవిత్ర అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.లక్షా 20వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరిచారు.

గంజాయి స్వాధీనం

రాయగడ: మునిగుడ పోలీసులు బస్టాండు సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన 45.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుణుపురం స్టాండు సమీపంలో నాలుగు పాలిథిన్ బస్తాల్లో గంజాయిని రవాణాకు సిద్ధంగా ఉంచినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 45.8 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు.